




కూకట్‌పల్లిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలతో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, అతిథులు

శేరిలింగంపల్లిలో అతిథుల నుంచి బహుమతులు అందుకుంటున్న ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలు

ముందే వచ్చిన సంక్రాంతి

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ ముత్యాల ముగ్గుల పోటీలకు విశేష స్పందన ● కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్, చందానగర్ పీజేఆర్ స్టేడియంలో ముగ్గులు వేసేందుకు పోటీపడ్డ మహిళలు

కూకట్‌పల్లి జోన్ బృందం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగను పురస్కరించుకొని ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు బెంగళూరు, రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన ఆధ్వర్యంలో) ఆదివారం కేపీహెచ్‌బీ రమ్యగ్రౌండ్‌లో నిర్వహించారు. ముగ్గులు వేసేందుకు మహిళలు పోటీపడ్డారు. 150 మంది పాల్గొన్నారు. ఇంటి ముందు ముగ్గు వేసే సంప్రదాయాన్ని ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ భావితరాలకు పరిచయం చేయాలన్న సంకల్పం గొప్పదని వక్తలు పేర్కొన్నారు. ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, ప్రత్యేక అతిథిగా సినీనటి సునీత పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా రిషి మహిళా ఇంజనీరింగ్ కళాశాల మేనేజ్‌మెంట్ స్టడీస్ హెచ్‌వోడీ ప్రవీణ, లింగమనేని స్కూల్స్ డైరెక్టర్ జ్ఞానిత జయ వ్యవహరించారు. తెలుగు వారి సంస్కృతి సంప్రదాయం ఉట్టిపడేలా వేసిన ముగ్గులను చూసి మంత్ర ముగ్ధులయ్యారు. విజేతలను ఎంపిక చేసేందుకు తీవ్రమైన కసరత్తు చేశారు. రంగవల్లుల వద్ద మహిళలు, యువతులు ఫొటోలు దిగుతూ సందడి చేశారు. అతిథులు మాట్లాడుతూ..



పీజేఆర్ స్టేడియంలో ముగ్గులు వేస్తున్న మహిళలు



హరిదాసుడి వేషధారణలో నూకరాజు

సంక్రాంతి పండగ వారం రోజుల ముందే వచ్చినట్లు ఉందని, నగరాల్లో కనుమరుగవుతున్న ముగ్గులు వేసే సంప్రదాయం మరువనీయకుండా ముగ్గుల పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. పోటీలో పాల్గొన్న అందరూ విజేతలే అని కార్పొరేటర్ అనడంతో హర్షం వ్యక్తం చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా నాగలక్ష్మి, కె. శిరీష, శ్యామల నిలిచారు. వీరికి రూ. 6వేలు, 4 వేలు, 3 వేలు నగదు బహుమతితోపాటు ముగ్గులు వేసిన అందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. నూకరాజు హరిదాసుడి వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఆంధ్రజ్యోతి డిప్యూటీ చీఫ్ రిపోర్టర్ మల్లికార్జున్, డిప్యూటీ చీఫ్ సబ్‌ఎడిటర్ దాసు, డిజైనర్ నారాయణరెడ్డి, కూకట్‌పల్లి జోన్ ఇన్‌చార్జి గుంటూరు శేఖర్, రిపోర్టర్లు రావెళ్ల హరిబాబు, ప్రసాద్, గింజుపల్లి వేణు మాధవ్, వెంకట్, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్, రత్నదాసు, సైదులు, యాడ్స్ విభాగం చందలూరి హరిబాబు, పున్నారావు, ఫొటోగ్రాఫర్ మాచర్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పీజేఆర్ స్టేడియంలో..

శేరిలింగంపల్లి జోన్‌బృందం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరా బ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు.. (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు బెంగళూరు, రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన ఆధ్వర్యంలో) ఆదివారం చందానగర్ పీజేఆర్ స్టేడియంలో నిర్వహించారు. 150 మంది పాల్గొని ముగ్గులు వేశారు. ముఖ్యఅతిథిగా గ్రీన్‌లైఫ్ ఆస్పత్రి వ్యవస్థాపకురాలు, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ స్వాతి, న్యాయనిర్ణేతలుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలుగు ఆచార్యులు విజయలక్ష్మి, ప్రముఖ వ్యాపారవేత్త దత్తశ్రీ వ్యవహరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలుగా భార్గవి, శాంతిప్రియ, వసుంధరదేవి నిలిచారు. బీజేపీ సీనియర్ నాయకుడు మారబోయిన అనిల్ కుమార్ యాదవ్ సహకారంతో ముగ్గురు విజేతలకు రూ. 6 వేలు, 4 వేలు, 3 వేలతోపాటు ముగ్గులు వేసిన అందరికీ ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఆచార్య విజయ లక్ష్మి మాట్లాడుతూ.. ముగ్గులు వేసే సంప్రదాయాన్ని భావితరాలకు అందించాలన్నారు. ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ వారు ప్రతి సంవత్సరం ముత్యాల ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆంధ్రజ్యోతి స్టాఫ్ రిపోర్టర్ కృష్ణయ్య సబ్ ఎడిటర్ పరంధాములు, శేరిలింగంపల్లి జోన్ ఇన్‌చార్జి కె. శ్రీనివాస్‌గౌడ్, రిపోర్టర్లు కె. అశోక్‌యాదవ్, జె. మల్లేశ్, దారుగుపల్లి సత్యనారాయణ, ఎంఎస్ఆర్ మూర్తి, కె.సతీష్ బాబు, ఫొటోగ్రాఫర్ ఆర్.కుమార్ పాల్గొన్నారు.



ముగ్గును పరిశీలిస్తున్న న్యాయ నిర్ణేతలు





ముగ్గులు వేస్తున్న దివ్యాంగురాలు, వృద్ధురాలు, బాలిక



మహిళల ఉత్సాహం చూసి తానూ ఇలా సరదాగా ముగ్గు వేస్తున్న న్యాయ నిర్ణేత ప్రవీణ



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సన్మానిస్తున్న కాలనీలవాసులు

ఎమ్మెల్యే కృతజ్ఞత యాత్ర

పేట్‌బషీరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో తనను గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేస్తూ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ చేపట్టిన కృజ్ఞత యాత్ర ఆదివారం అంగడిపేట, మీనాక్షి ఎస్టేట్, స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీ, జీడిమెట్ల గ్రామం, జయరామ్‌నగర్, అయోధ్యనగర్, కుత్బుల్లాపూర్ గ్రామం వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ప్రజల మద్దతుతోనే విజయం సాధించానన్నారు. వివేకానంద్‌కు ప్రజలు హారతి ఇచ్చి స్వాగతం పలికారు. కాలనీల సంక్షేమ సంఘం సభ్యులు శాలువాతో ఆయనను సన్మానించారు. బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటా'

మియాపూర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నరేన్‌గార్డెన్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆదివారం కృతజ్ఞత సభ నిర్వహించారు. ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు ఉప్పలపాటి శ్రీకాంత్, హమీద్‌పటేల్, రాగం నాగేందర్‌యాదవ్, వెంకటేష్‌గౌడ్, సత్యనారాయణ, నార్నె శ్రీనివాసరావు, మంజులరెడ్డి, రోజాదేవి పాల్గొన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. మూడోసారి ఎమ్మెల్యేగా గాంధీని గెలిపించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే గాంధీ మాట్లాడుతూ.. తన గెలుపునకు సైనికుల్లా పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు రుణపడి ఉంటానన్నారు. కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలని, త్వరలో జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. మాజీ కౌన్సిలర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ నాయకులు, కార్యకర్తలు, కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



రేగులకుంట చెరువు సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

చెరువు సుందరీకరణ పనుల పరిశీలన

చందానగర్ దీప్తిశ్రీనగర్‌లో రేగులకుంట చెరువు సుందరీకరణలో భాగంగా సేల్స్‌ఫోర్స్ ఐటీ కంపెనీ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా రూ.1.50 కోట్లతో చేస్తున్న పనులను ఎమ్మెల్యే గాంధీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను కోరారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినికిడి యంత్రానికి మాజీ ఎమ్మెల్యే ఆర్థికసాయం

గచ్చిబౌలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): వినికిడి లోపం ఉన్న ఓ వ్యక్తికి సందయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ వినికిడి యంత్రం కోసం రూ. 50 వేలు అందజేశారు. మియాపూర్‌కు చెందిన మనోజ్ చిన్నప్పటి నుంచి వినికిడి లోపంతో ఇబ్బంది పడుతున్నారు. అతడికి వైద్యం చేయించుకోలేని పరిస్థితి ఉండడంతో స్థానికులు విషయాన్ని భిక్షపతియాదవ్ దృష్టికి తీసుకెళ్లగా ఆర్థికసాయం చేశారు. చెక్కును మనోజ్‌కు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జనావాసాల మధ్య రెడీమిక్స్ ప్లాంట్

● ఏర్పాటును నిరసిస్తూ స్థానికుల ధర్నా

హైదర్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య రెడీమిక్స్ ప్లాంట్ ఏర్పాటును నిరసిస్తూ హైదర్‌నగర్ డివిజన్ వర్టెక్స్ ప్రీమియో అపార్ట్‌మెంట్స్ వాసులు ఆందోళనకు దిగారు. నిజాంపేట్ రోడ్ హైటెన్షన్ లైన్‌లో ప్రణీత్ కన్‌స్ట్రక్షన్ సంస్థ వర్టెక్స్ ప్రీమియో అపార్ట్‌మెంట్స్ పక్కన రెడీమిక్స్ ప్లాంట్ నిర్మాణ పనులు ప్రారంభించింది. ప్లాంట్ నిర్మాణంతో ఇళ్లలోకి దుమ్ము చేరడంతోపాటు శబ్ద కాలుష్యం ఉంటుందని స్థానికులు అన్నారు. ప్లాంట్ ఏర్పాటు విషయమై జీహెచ్‌ఎంసీ, పొల్యూషన్ బోర్డుకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. రెడీమిక్స్ ప్లాంట్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు.



ప్రణీత్ కన్‌స్ట్రక్షన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న స్థానికులు

అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ

పేట్‌బషీరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అయోధ్య శ్రీరాముడి అక్షింతల పంపిణీ కార్యక్రమం ఆదివారం కొంపల్లి మున్సిపల్‌లోని అశోక అలమైసన్‌లో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్. మల్లారెడ్డి అసోసియేషన్ సభ్యులతో కలిసి పంపిణీ చేశారు. కాలనీ అధ్యక్షుడు పి.సి. రెడ్డి, గౌతమి ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులతో జగదీశ్వర్‌గౌడ్ సమావేశం

హైదర్‌నగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ నాయకులతో శేరిలింగంపల్లి ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ భాగ్యనగర్‌కాలనీ జీవీఆర్ కార్యాలయంలో ఆదివారం సమావేశం నిర్వహించారు. బూత్ స్థాయి నుంచి డివిజన్, అనుబంధ సంఘాల కమిటీలను ఎన్నుకోవడంపై చర్చించారు. గొట్టిముక్కల వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య కార్యవర్గం ప్రమాణ స్వీకారం

చందానగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆర్యవైశ్య ఐక్యవేదిక, శేరిలింగంపల్లి ఆర్యవైశ్య సంఘం సభ్యుడు గజ్జల యోగానంద్ ఆధ్వర్యంలో చందానగర్‌లో ఆదివారం సమావేశం నిర్వహించారు. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గౌరవాధ్యక్షుడిగా పచ్చిపులుసు శ్రీనివాస్‌గుప్తా, అధ్యక్షులుగా పసుమర్తి శ్రీనివాసరావుగుప్తా, కోశాధికారిగా భవిరిశెట్టి కోటేశ్వరరావుగుప్తా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ ఆర్యవైశ్య ఐక్యవేదిక నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసింది. ఆర్యవైశ్య సంఘం సభ్యులు పాల్గొన్నారు.

మార్పులకు అనుగుణంగా విద్యా విధానం సాగాలి

పేట్‌బషీరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధస్సు సమాజంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతుందని ఉమ్మడి రాష్ట్రాల సమాచార ప్రధాన మాజీ కమిషనర్ డాక్టర్ వర్రె వెంకటేశ్వర్లు అన్నారు. జీడిమెట్ల డీఎంఎస్ పాఠశాలలో ఆదివారం నిర్వహించిన సినర్జియా కార్నివాల్ వేడుకలను ఆయన ప్రారంభించారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యావిధానం సాగాలని అన్నారు. పాఠశాల డైరెక్టర్ అనిన్‌ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న కార్పొరేటర్ నర్సింహయాదవ్

సీసీ రోడ్లు ప్రారంభం

ఓల్డుబోయినపల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ అన్నారు. ఓల్డుబోయినపల్లి డివిజన్‌లో సిండికేట్ బ్యాంక్ కాలనీ, దుబైగేట్, షేర్‌గల్లీలో సీసీ రోడ్లను ప్రారంభించారు.

భక్తిశ్రద్ధలతో తులసి పూజలు

ఫతేనగర్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): భరత్‌నగర్ కాలనీ హరిహర కళాక్షేత్రంలోని సీతారామ ఆలయంలో లక్షతులసి అర్చన పూజలు నిర్వహించారు. కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు.

'విద్యార్థులూ.. నేర్చుకోవడం ఆపొద్దు'

పేట్‌బషీరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శివ శివాని ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్(మేనేజ్‌మెంట్ ఫెస్ట్)25వ సమన్వయ వేడుకలు రెండు రోజులు నిర్వహించారు. మేనేజింగ్ పార్టనర్ కె. సుమంత్ మాట్లాడుతూ.. విద్యార్థులు నేర్చుకోవడం ఎప్పుడూ ఆపొద్దన్నారు. మేనేజ్‌మెంట్ ఫెస్ట్‌లో నిర్వహణ, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు తదితర అంశాలు నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నగదుతోపాటు ప్రశంసాపత్రాలు, ట్రోఫీ అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పలు రాష్ట్రాలకు చెందిన 1,500 మంది విద్యార్థులు హాజరయ్యారు. శివ శివాని ఇన్‌స్టిట్యూట్స్ విద్యా సంస్థ ప్రెసిడెంట్ ఆర్తీ సంపతి, ఉపాధ్యక్షులు డిప్యూటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ డాక్టర్ శైలజా సంపతి, దీపికా సంపతి, డైరెక్టర్ ఎస్వీ రమణారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు శిక్షణ ఇవ్వాలి

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మత్స్యరంగంలో అందుబాటులోకి వచ్చిన అవకాశాలు, ఆధునిక విధానాలపై మత్స్యకారుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పద్మశ్రీ, ప్రపంచ ప్రఖ్యాత మత్స్యరంగ నిపుణులు డాక్టర్ మోదడుగు విజయ్ గుప్తా అన్నారు. ఆదివారం తెలంగాణ ఫిషరీస్ ఫెడరేషన్ మాజీ చైర్మన్ పిట్టల రవీందర్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ ఫిషరీస్ సొసైటీ ఆవిర్భావ సభలో ఆయన మాట్లాడారు. చేపల ఉత్పాదకతలో ప్రపంచ వ్యాప్తంగా విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయని, ఈ మార్పులకు అనుగుణంగా ఇక్కడి మత్స్యకారులకు శిక్షణ ఇస్తే, మత్స్య రంగంలో గణనీయమైన మార్పులకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా జిల్లాల కన్వీనర్లను నియమించారు.



సొసైటీ జిల్లా కన్వీనర్లతో డాక్టర్ విజయ్ గుప్తా, పిట్టల రవీందర్



మహిళకు అవార్డు అందజేస్తున్న మంత్రి సీతక్క

ప్రతిభ కనబర్చిన మహిళలకు లైమ్‌లైట్ అవార్డులు

రాయదుర్గం, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సుమధుర ఇన్‌ఫ్రాకాన్ ప్రైవేట్ లిమిటెడ్, మానేపల్లి జ్యువెలర్స్ సహకారంతో వైశ్య లైమ్‌లైట్ అవార్డ్స్ కార్యక్రమం ఫిల్మ్‌నగర్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్ సెంటర్‌లో ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి సీతక్క వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన మహిళలకు అవార్డులు అందజేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. సమాజంలో మహిళలపై ఇంకా చిన్న చూపు ఉందన్నారు. అవార్డులు సాధించిన మహిళలను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మహిళలను గౌరవించి వారిని ప్రోత్సహిస్తే మరింత ముందుకెళ్తారన్నారు. కుటుంబంలో అమ్మ, సోదరి, భార్య లేకుంటే మనుగడ లేదన్నారు. ప్రతిభావంతులైన మహిళలను గుర్తించి వారిని అవార్డులతో గౌరవిస్తున్న సంస్థల నిర్వాహకులను మంత్రి అభినందించారు. నిజామాబాద్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్, రాష్ట్ర పోలీస్ హౌసింగ్‌బోర్డు మాజీ చైర్మన్ దామోదర్, రాష్ట్ర హస్తకళ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ మాజీ చైర్మన్ బొల్లం సంపత్‌కుమార్, రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి సంస్థ లిమిటెడ్ మాజీ చైర్మన్ లక్ష్మీనారాయణ, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జడ్‌సీగా బాధ్యతలు స్వీకరించిన స్నేహ శబరీస్

గచ్చిబౌలి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్‌గా స్నేహ శబరీస్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని, తప్పులు జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఉపకమిషనర్ రజనీకాంత్‌రెడ్డి జడ్సీకి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు అధికారులు పాల్గొన్నారు.

'మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజ పురోగతి'

హైదరాబాద్ సిటీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే సమాజం పురోగతి సాధిస్తుందని ఎఫ్ఐజీఓ కోశాధికారి ప్రసూతి, గైనకాలజీ సొసైటీ ఆఫ్ హైదరాబాద్ (ఏఐసీఓజీ) ఆర్గనైజింగ్ చైర్‌పర్సన్, ప్రెసిడెంట్ ప్రొఫెసర్ ఎస్.శాంతకుమారి అన్నారు. హెచ్ఐసీసీలో ఆదివారం 66వ ప్రసూతి, ప్రసూతి సేవల సదస్సును డీపీ అధ్యక్షుడు డాక్టర్ హృషికేశ్, ప్రెసిడెంట్ డాక్టర్ జయదీప్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ.. మాతా శిశు మరణాలను తగ్గించడానికి ప్రభుత్వంతో కలిసి కృషి చేస్తున్నామని తెలిపారు. దేశంలో తెలంగాణలోనే అతి తక్కువ మాతా శిశు మరణాల రేటు ఉందన్నారు. మహిళలపై హింసను నిరోధించేందుకు, మహిళల్లో చైతన్యం కలిగించేందుకు రెండు గంటల ఆన్‌లైన్ కోర్సును ప్రారంభించామన్నారు. త్వరలో జరిగే ఆఫ్‌లైన్ కోర్సులో శిక్షణ ఇచ్చేందుకు ఆరువేల మంది గైనకాలజిస్టులు సిద్ధంగా ఉన్నారన్నారు. డాక్టర్ మాధురీ పటేల్, డాక్టర్ అల్కా పాండే, డాక్టర్ ఆషా బాక్సీ, డాక్టర్ గీతేంద్ర శర్మ, డాక్టర్ సంపత్‌కుమారి తదితరులతోపాటు దేశ, విదేశాల నుంచి దాదాపు 12 వేల మంది ప్రతినిధులు పాల్గొన్నారు.

నేడు అన్ని సర్కిళ్లలో ప్రజావాణి

కూకట్‌పల్లి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): నాలుగేళ్లుగా నిర్వహించని ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రతి సోమవారం నిర్వహించాలని జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈనెల 8న అన్ని జోనల్, సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించనున్నారు. ప్రజావాణి కార్యక్రమం నిలిపివేయడంపై అప్పట్లో 'ఆంధ్రజ్యోతి' పలు కథనాలు ప్రచురించింది. కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రజావాణి కార్యక్రమ ప్రాధాన్యతను వివరిస్తూ గత నెల 11వ తేదీన 'అటకెక్కిన ప్రజావాణి' శీర్షికన మరోసారి ప్రత్యేక కథనం ప్రచురించడంతో ఉన్నతాధికారులు స్పందించారు. సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది. అధికారులు ప్రజల నుంచి సమస్యలపై ఫిర్యాదులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు చేపట్టనున్నారు.